క్లుప్తంగా

'ఎంపీ సోయంను విమర్శిస్తే ఊరుకోం'

ఇచ్చోడ: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావును పాడర్స్ అసోసియేషన్ పోరం సభ్యులు విమర్శిస్తే ఊరుకోమని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ హెచ్చరించారు. బుధవారం ఆదివాసీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఆదివాసీ తెగలో పుట్టిన 12 మంది ఆదివాసీలు క్రిస్టియన్ మతాన్ని స్వీకరించిన వారు ఆదివాసీ గ్రామాల్లో పర్యటిస్తూ.. మత మార్పిడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాంటి వారికి తగిన బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో మెస్రం నాగనాథ్, మెస్రం భీజన్న, జుగ్గుక్ సంభాన్న, మెస్రం రాజేశ్వర్, కొట్నాక్ కేశవ్, పెందూర్ గంగాధర్, తొడసం శంకర్ పాల్గొన్నారు.

'లోక్ అదాలత్' సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: జూన్ 10న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టీ. దుర్గారాణి అన్నారు. బుధవారం ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల సీఐ, ఎస్సై, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కేసులు ఉన్న వారు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాలిక్, న్యాయవాదులు జగన్, జైరాజ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాధుసంతులు దేశానికి అవసరం

నేరడిగొండ: సాదుసంతులు దేశానికి అవసరమని తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న కులమాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బుధవారం హాజరయ్యారు. ఆధ్యాత్మిక చింతన చేకూర్చడంలో సాధుసంతుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటకు రమణ, స్వాములు, పీఠాధిపతులు, భక్తులు పాల్గొన్నారు.

'అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదు'

ఆదిలాబాద్‌అర్బన్: జైనథ్ మండలం పూసాయి అంగన్‌వాడీ టీచర్ రాజీనామా విషయంలో సర్పంచ్ అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాధ తెలిపారు. అంగన్‌వాడీలు తప్పు చేస్తే శాఖ పరమైన చర్యలకు అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

తాంసి: ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సిద్ధమవుతున్న రైతులు పత్తి, కంది విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని తాంసి ఇన్‌చార్జి ఏడీఏ రవీందర్ సూచించారు. బుధవారం మండలంలోని బండల్‌నాగాపూర్ రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. పూర్తిస్థాయిలో వర్షాలు కురిసిన తరువాతనే విత్తనాలు వేసుకోవాలన్నారు. ఎవరైనా అనుమతి లేని విత్తనాలు అమ్మడం వంటివి చేపడితే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగు వెంకన్న, ఏఈవో వెంకట్, శ్రీకాంత్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి

ఇచ్చోడ: విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. బుధవారం బోరిగామ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ మరమ్మతుల కోసం ఎంపీపీ నిధులు నుంచి రూ 2 లక్షల 40 వేలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌రెడ్డి, బత్తుల అశోక్, అబ్దుల్ రదీఫ్ పాల్గొన్నారు.

కష్టపడిన వారికే గుర్తింపు

ఉట్నూర్‌రూరల్: కష్టపడిన వారికే గుర్తింపు లభిస్తుందని మండల ఉన్నోగ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ముస్కాన్ అవార్డు స్వీకరించిన ఉట్నూర్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్, ఆసుపత్రి సిబ్బందిని బుధవారం ఘనంగా సన్మానించారు. ఆసుపత్రితో పాటు మండల కేంద్రానికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. రవీందర్‌రావు, ప్రజ్ఞశీల్, వెంకటేశ్, శ్రీనివాస్, అజయ్, సునీల్, దాక్టర్లు మహేందర్, మమత, రత్నమాల, దత్త రామ్, రాజేంద్ర, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా అయిలబాయి జయంతి

బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో అంతరాష్ట్ర రోడ్డు పక్కన మండల కురుమ, యాదవ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాజమాత అయిలబాయి హోళ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఆయిలబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గోరే విశాల్, నిఫ్రుంగే గజేశ్, పోతే అమోల్, నిఫ్రుంగే యశ్వంత్, గోహార్కర్ రాజు, వికాస్, వినాయక్ పాల్గొన్నారు.

అదుపు తప్పితే అంతే..

- యాపల్‌గూడ వంతెన వద్ద ఏర్పడిన గుంత
- బంగారుగూడలో అప్రోచ్ రోడ్డుకు ఏర్పాటు చేయని గార్డ్‌స్టోన్స్



అప్రోచ్ రోడ్డుకు కనిపించని గార్డ్ స్టోన్స్



వంతెన ఏర్పడిన భారీ గుంత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అనుకుంట రోడ్డు మార్గం గుండా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ, రాంపూర్, రామాయి, జైనథ్, బేల, గాదిగూడ మండలంలోని ప్రజలు ప్రతీరోజు రాకపోకలు నిర్వహిస్తుంటారు. అలాగే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. యాపల్‌గూడ సమీపంలోని వంతెనకు అనుకొని ఇటీవల కురిసిన వర్షానికి పెద్ద గుంత ఏర్పడింది. ఎదురుగా వాహనం వస్తున్న సమయంలో దారి ఇవ్వటప్పుడు, రాత్రి సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేయిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

మండలంలోని బంగారుగూడ సమీపంలో లోలెవల్ వంతెన ఉండడంతో వర్షకాలంలో చిన్నపాటి వర్షం కురిసిన వరద నీరు వంతనపై నుంచి ప్రవహిస్తుంది. అయితే ఇటీవల అక్కడ వంతెన నిర్మాణం చేపట్టారు. దీంతో అటు వైపు నుంచి వెళ్లే ప్రయాణికుల కష్టాలు తీరాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. వంతెన అప్రోచ్ రోడ్డుకు గార్డ్ స్టోన్స్ (రక్షణ దిమ్మలు) ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు అదుపు తప్పి వాగులో పడి పోయే ప్రమాదం ఉంది.

ముందుగా మేలుకుంటే మంచిది

బంగారుగూడ, యాపల్‌గూడ సమీపంలోని వంతెనల వద్ద ప్రమాదాలు జరగక ముందే అధికారులు మేలుకొని చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో వంతెన వద్ద ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై ఉంది.

మరమ్మతులు చేయిస్తాం

యాపల్‌గూడ సమీపంలో వంతెన వద్ద గుంత ఏర్పడిన విషయం మా దృష్టికి వచ్చింది. సంబంధిత ఏజెన్సీకి చెప్పి రెండు, మూడు రోజుల్లో మరమ్మతులు చేయిస్తాం. బంగారుగూడ సమీపంలోని ఇటీవల నిర్మించిన వంతెనలో అప్రోచ్ రోడ్డుకు గార్డ్ స్టోన్లకు సంబంధించి బిల్లింగ్ మెంట్‌లో లేదు.

– నరేశ్, ఆర్‌అండ్‌బీ అధికారి

అటెన్షన్ ప్లీజ్.. పిచ్చి మొక్కలు తొలగించండి



బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని శివాజీ మార్కెట్ కాలనీ ఆనుకొని ఉన్న వాగులో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో వర్షాకాలం వరద ప్రవాహానికి అడ్డుగా నిలిచి ప్రమాదం ఉంది. పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: మహేందర్‌రెడ్డి, ఎంపీవో, ఫోన్: 82474 57079

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

జైనథ్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. బుధవారం మండలంలోని ముక్త్యాపూర్‌లో దత్త మందిరంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, గ్రామస్తులతో కలిసి దత్త మహరాజ్ విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, వ్యసనాలు వీడి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు.



దత్త విగ్రహానికి పూజలు చేస్తున్న పాయల్ శంకర్

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ప్రముఖులు..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని వేణునగర్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి జిల్లా జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేలు, జెడ్పీటీసీ చారులత రాథోడ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో హిందూవాహిని సమితి మండల అధ్యక్షుడు అరికిల్ల అశోక్, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, భూమన్న, తానాజీ, ఉపేందర్, వడేమ్యేర్, కోటేశ్, శ్రీకాంత్, ఉమేశ్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

ఆదిలాబాద్: యువత సన్మార్గంలో నడవాలని బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ఢిల్లీ ప్రతినిధి బ్రహ్మకుమార్ అనిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కేంద్రంలో బుధవారం మాట్లాడారు. యువత తమలోని శక్తియుక్తులను సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ఢిల్లీ నుంచి కన్యాకుమారి వరకు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. యాత్రలో భాగంగా జిల్లా కేంద్రానికి చేరుకున్నామన్నారు. గురువారం విశ్వవిద్యాలయంలో యువతకు అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో నిర్వాహకురాలు రేవతి బెహెన్, ఢిల్లీ ప్రతినిధులు ప్రశాంత్, హిమాన్షు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ఢిల్లీ ప్రతినిధి బ్రహ్మకుమార్ అనిల్

'దీక్ష దివస్ జయప్రదం చేయండి'

ఎదులాపురం: సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర 7వ మహాసభల్లో భాగంగా ఈనెల 2 నుంచి 12 వరకు ప్రజా సమస్యలు, వారి ఆకాంక్షల సాధన లక్ష్యంగా దీక్ష దివస్ నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. రెండు నెలలుగా గోనె సంచులు లేవని, లారీలు రావట్లేదని ధాన్యం కొనుగోలు నిలిపివేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు ఆసరా పెన్షన్లు, ఉద్యోగులకు జీతాలు లేవని, ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఇవన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వానికి కనబడటం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు ఉమ్మే నితిన్, వినోద్, రవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్‌సింగ్

ఎవరికోసం ఉత్సవ ఆర్భాటాలు

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎవరికోసం దశాబ్ది ఉత్సవాలు ఆర్భాటంగా నిర్వహిస్తుందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ జిల్లా నాయకుడు జగన్‌సింగ్ ప్రశ్నించారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లయినా ప్రజల ఆకాంక్ష నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ప్రతిఒక్కరికీ పది కిలోల రేషన్ బియ్యం ఇవ్వాలని ఈనెల 2 నుంచి 12 వరకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు నితిన్, వినోద్, రవి, తదితరులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమానికి విరాళం

బజార్‌హత్నూర్: మండలంలోని గిర్నూర్ గ్రామంలోని శబరిమాత ఆశ్రమం అభివృద్ధికి బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకలి దశరథ్ బుధవారం రూ.11 వేలు నగదు విరాళం అందజేశారు. అనంతరం బీజేపీ మండల నూతన కార్యవర్గం ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శంకర్, కిషన్, ఓబీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు బక్రి రమేశ్, సోషల్ మీడియా మండల కన్వీనర్ జ్ఞానేశ్వర్‌లను సాకలి దశరథ్ సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు బత్తిని సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి పెరుగు సంతోష్, సర్పంచ్ సందీప్ పాల్గొన్నారు.

ధూమపానానికి దూరంగా ఉండాలి

ఇచ్చోడ: యువత ధూమపానానికి అలవాటు పడకుండా తమ జీవితాలను రక్షించుకోవాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బోరిగామలో ర్యాలీ నిర్వహించారు. పొగాకు, చుట్ట, బీడీ, ఖైని, సిగరెట్, గుట్కా వాటితో ఆరోగ్యం పాడవుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజేకిరణ్, ఏఎన్ఎం కరుణ, ఆశ కార్యకర్త గంగామణి పాల్గొన్నారు.

'సభ విజయవంతం చేయండి'

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఈనెల 6న నిర్వహించే బహిరంగా సభను విజయవంతం చేయాలని నేతకాని మహార్ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ బోర్కాంబుల దీపక్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. బడుగు, బలహీన వర్గాల హక్కులు సాధించేందుకు, అన్ని వర్గాల వారిని ఏకతాటిపై తీసుకురావడమే సభ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో నేతకాని మహార్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగోసేన్, మానిక్‌రావ్, సోన్‌కాంబ్లే బాబాసాహెబ్, సోయం రాందాస్, ప్రజ్ఞాకుమార్, మారుతి, కేశవ్ పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

సర్వీసు రోడ్లపైనే పార్కింగ్



నేరడిగొండ: మండల కేంద్రంలో సర్వీసు రోడ్లపై వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. అలాగే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీసు రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



45 అడుగుల హనుమాన్ విగ్రహం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీ వాడ జై హనుమాన్.. జై హనుమాన్.. జై బోలో హనుమాన్‌కి జై అనే నామస్మరణతో మార్మోగింది. శ్రీ సంకట హరణ హనుమాన్ మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన 45 అడుగుల భారీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి, నారాయణ మహరాజ్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, దిట్టాల సుహాసినిరెడ్డి హాజరయ్యారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- తూతూమంత్రంగా ప్రగతి నివేదికలు
- చర్చకు రాని సమస్యలు
- గంటలో ముగిసిన సమావేశం

బోథ్: మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ తుల శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం రైతువేదికలో నిర్వహించారు. 21 శాఖలకు సంబంధించిన అధికారులు హాజర్ణై ప్రగతి నివేదికలు వినిపించాల్సి ఉండగా.. 13 మంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. వచ్చిన అధికారులు మాత్రమే తూతూమంత్రంగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమస్యలు చర్చకు రాకుండానే గంటలోనే సమావేశాన్ని ముగించారు. బోథ్ మండలంలో అనేక సమస్యలు ఉన్నా.. ప్రజాప్రతినిధులు మాత్రమే దకపోవడం విడ్డూరం. ఇద్దరు మహిళా ఎంపీటీసీలు, ఒకరిద్దరు సర్పంచులు మాత్రమే సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జొన్న పంట ఎకరానికి 15 క్వింటాళ్ల కొనుగోలు చేయాలని తీర్మానించి ప్రభుత్వానికి పంపుతామని ఎంపీపీ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

సమస్యలు ఇవీ..

- బోథ్ మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న కంఠె వాగు బ్రిడ్జి కూలిపోయింది. వర్షాకాలంలో వరద దాదాపు 19 గ్రామాలకు రాకపోకలు సాగే అవకాశం లేదు. ఈ విషయం సమావేశంలో చర్చకు రాలేదు.
- ఇటీవల కురిసిన వర్షానికి రైతులు పంటను నష్టపోయారు. ఎకరానికి రూ. 10వేలు సహాయం రైతులకు ఇంకా అందలేదు.
- మర్లపెల్లి రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. 19 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రస్తావించలేదు.
- మండలంలోని నాగాపూర్‌తో పాటు అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. లీకేజీలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

కార్యాలయానికి అందని ప్రగతి నివేదికలు..

ఈనెల 31న మండల సర్వసభ్య సమావేశం ఉందని మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రకటన వచ్చింది. 28లోపు ఆయా శాఖల అధికారులు తమ ప్రగతినివేదికను మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలి. కానీ అధికారులు సమర్పించలేదు. నేరుగా సమావేశానికి వచ్చిన ఒక పేపర్‌పై రాసుకుని చదివి వినిపించారు.

పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదు

ఆదిలాబాద్‌రూరల్: పద్మశాలీల ఆత్మగౌరవం, సంఘటిత శక్తిని చాటేందుకే శాశ్వత సభ్యత్వ నమోదు చేపట్టినట్లు పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ రావు అన్నారు. ఆదిలాబాద్‌లోని పద్మశాలి సంఘ భవనంలో సభ్యత్వ నమోదు, జిల్లా కన్వీనర్, కోకన్వీనర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బుధవారం హాజరయ్యారు. పాదదర్శకంగా రూ. 10తో శాశ్వత సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. దొంతం లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధన కోసం కృషి చేయాలన్నారు. బోథ్ నియోజకవర్గానికి చెందిన వి. సురేందర్, మాజీ ఎంపీపీ గంగుల మల్లేశ్‌లకు రాష్ట్ర కార్యవర్గంలో నియమిస్తూ ప్రకటించారు. అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేత రమేశ్, నల్ల కనకయ్య, కాముని విశాల్, జక్క రమేశ్, బొమ్మకంటి రమేశ్, అనుముల ఉజ్వల్, జక్కుల సత్యనారాయణ, చిలుక విలాస్, శ్రీధర్, లచ్చిరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలి నాయకులు

'ఆరోపణలు నిరూపించాలి'

ఆదిలాబాద్‌రూరల్: రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ భూనిర్వాసితుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దిట్టాల సుహాసిని రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని, ఆ ఆరోపణలు నిరూపించాలని ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేశ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. త్వరలో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని గ్రహించిన బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధికోసం బీఆర్ఎస్ నాయకులపై, ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీకి చెందిన ఒకరేమో సిమెంట్ ఫ్యాక్టరీ స్థలం వద్దకు వెళ్లి ఆందోళన చేపడుతుంటే మరొకరేమో ట్రాక్టర్ నాగ్లతో హంగామా చేస్తున్నారని విమర్శించారు. స్వప్రయోజనాల కోసం ప్రజలను పక్కా తోవ పట్టిస్తున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు కనక రమణ, సెవ్వ జగదీష్, కుమ్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గండ్రత్ రమేశ్

సమాచారం

నేడు జొన్న కొనుగోళ్లు ప్రారంభం

బోథ్: బోథ్ మార్కెట్‌యార్డులో గురువారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్న కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. కొనుగోళ్లను ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ప్రారంభిస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు కొనుగోళ్లను ప్రారంభిస్తామని బోథ్ పీఏసీఎస్ సీఈవో స్వామి తెలిపారు.

6న విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ మహాసభ

ఆదిలాబాద్‌అర్బన్: విశ్వబ్రాహ్మణ ఆత్మ గౌరవ మహాసభ జూన్ 6న ఉదయం 10 గంటలకు ఆదిలాబాద్ పట్టణ శివారులోని గాయత్రి గార్డెన్‌లో నిర్వహించడం జరుగుతుందని సంఘం రాష్ట్ర నాయకుడు కిష్టయ్య తెలిపారు. బుధవారం పట్టణంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని చాటేలా అందరూ తరలిరావాలన్నారు.

'సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి'

ఇచ్చోడ: పదహారు సంవత్సరాలుగా సెకండ్ ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని సెకండ్ ఏఎన్ఎంల సంఘం జిల్లా కన్వీనర్ కొప్పుల విజయలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాక ముందు కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయకుండా జాప్యం చేసిందన్నారు. కార్యక్రమంలో గంగామణి, పద్మ, కరుణ, అహల్య దేవి, సంగీత పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు